క్లుప్తంగా

ఎంఈఓ పరిశీలన



విద్యార్థులతో ముచ్చటిస్తున్న ఎంఈఓ సత్యనారాయణ

మక్కువ: మండలంలోని శంబర హెచ్‌సీ పాఠశాలను ఎంఈఓ పెంట సత్యనారాయణ బుధవారం సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికలను తనిఖీ చేశారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. అనంతరం మధ్యాహ్న భోజనం వంటకాలను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు వండిపెట్టాలని నిర్వాహకులకు సూచించారు. విద్యార్థులకు అర్థమయ్యేలా సులభ పద్ధతిలో బోధించాలని, సిలబస్‌ను సకాలంలో పూర్తిచేయాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. హెచ్‌ఎం రాణి ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యేలు



కలెక్టర్‌కు మొక్కను బహూకరిస్తున్న కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి

పార్వతీపురం: జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌ను బుధవారం తన కార్యాలయంలో పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయా నియోజకవర్గాల్లోని ప్రధాన సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. తోటపల్లి ప్రాజెక్టు ద్వారా సాగునీటిని పూర్తిస్థాయిలో సరఫరా చేయాలని కోరారు. ఎమ్మెల్యేలతో పాటు ఆయా నియోజకవర్గాల నాయకులు ఉన్నారు.

దోమల మందు పిచికారీ



దోమల మందు పిచికారీ చేయిస్తున్న సర్పంచ్ రాగలత

బలిజిపేట: బలిజిపేటలో సర్పంచ్ బి.రాగలత ఆధ్వర్యంలో బుధవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వీధికాలువల్లో పూడికలు తొలగించి దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. వర్షాకాలంలో అంటు వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఆదిలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామంలోకి పందులు రాకుండా చూసుకోండి



పందుల పెంపకందారులతో మాట్లాడుతున్న కార్యదర్శి మనోహర్

సీతానగరం: మండలంలోని చినభోగిలిలో పందుల బెడద ఎక్కువగా ఉందని, వాటి కారణంగా గ్రామంలో పారిశుద్ధ్యం లోపించి ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని గ్రామస్తులు అంటున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారి ఆదేశాల మేరకు పందుల పెంపకందారులకు బుధవారం నోటీసులు జారీ చేసినట్లు పంచాయతీ కార్యదర్శి మనోహర్ తెలిపారు. గ్రామానికి దూరంగా పందుల శాలలను నిర్మించుకోవాలని వారిని కోరినట్లు చెప్పారు. గ్రామంలోని పందులు రాకుండా చూసుకోవాలని సూచించారు.

సీఆర్‌టీలకు సామర్థ్య పరీక్ష



సామర్థ్య పరీక్షను పర్యవేక్షిస్తున్న పీఓ రాహుల్‌కుమార్ రెడ్డి

సీతంపేట: గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో వివిధ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్‌టీ ఉపాధ్యాయులకు బుధవారం స్థానిక వైటీసీలో సామర్థ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన ఐటీడీఏ పీఓ టి.రాహుల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. తక్కువ మార్కులు వచ్చిన వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. మొత్తం 210 మంది సీఆర్‌టీలకు సామర్థ్య పరీక్షకు హాజరయ్యారు. కార్యక్రమంలో డీడీ అన్నదొర, డిప్యూటీ ఈఓ నారాయుడు, ఏఎంఓ కోటిబాబు, సీఎంఓ చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

షాపు అద్దె సంగతి తేల్చాల్సిందే..



వాడీవేడిగా జరుగుతున్న మున్సిపల్ సమావేశం



దగ్గరుండి 20వ షాపు తాళాలు పగులకొట్టిస్తున్న కౌన్సిలర్లు

- వాడీవేడిగా మున్సిపల్ సమావేశం
- మున్సిపల్ కాంప్లెక్స్‌లో 20వ షాపు అద్దె వ్యవహారంపై రచ్చ
- షాపు తాళాలు విరగకొట్టి తెరిపించిన కౌన్సిలర్లు

సాలూరు: మున్సిపల్ కాంప్లెక్స్‌లోని 20వ నంబరు షాపు అద్దె గోల్‌మాల్‌పై, డీజిల్ దుర్వినియోగంపై కౌన్సిల్ సభ్యులు అధికారులను నిలదీశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన, కమిషనర్ ప్రసన్నవాణి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మున్సిపల్ సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. సమావేశం ప్రారంభమయ్యాక అజెండాలోని అంశాలను సభ్యులు ఆమోదించారు. ప్రశ్నోత్తరాల సమయంలో షాపు నంబరు 20 అద్దె వ్యవహారం, డీజిల్ దుర్వినియోగంపై అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు ముక్తకంఠంగా అధికారులను నిలదీశారు. పారిశుద్ధ్య నిర్వహణ విభాగంలో వాహనాల డీజిల్ బిల్లులు సక్రమంగా ఉన్నాయని, మిగిలిన విభాగాల్లో డీజిల్ వాడకం గురించి తనకు తెలియదని శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఫకీర్‌రాజ్ సమాధానమిచ్చారు. మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, వైస్ చైర్‌పర్సన్ జర్జాపు దీప్తి, వైఎస్సార్‌సీపీ, టీడీపీ కౌన్సిలర్లు రాపాక మాధవరావు, గిరి రఘు, బలభద్రుని శ్రీనివాసరావు, గొర్లె వెంకటరమణ, హర్షవర్ధన్, లక్ష్మీ, తదితరులు మున్సిపల్ కాంప్లెక్స్‌లో 20వ షాపు అద్దె వ్యవహారంపై అధికారులను నిలదీశారు. ఈ క్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఈశ్వరమ్మ కలుగజేసుకుని ఆ షాపు ఖాళీగా ఉందని, అందులో అవినీతి జరగలేదని, అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారని అనడంతో సభాస్థలి వేడెక్కింది. పలువురు కౌన్సిలర్లు ఆమెతో వాగ్వాదానికి దిగారు. 2017 నుంచి ఈ షాపు అద్దె డబ్బులు ఎవరి జేబులోకి వెళ్లాయో తేలాలని, ఈ గోల్‌మాల్‌పై కలెక్టర్‌కు, ఏసీబీకి ఫిర్యాదు చేస్తామని అన్నారు. ఈ సమయంలో చైర్‌పర్సన్ సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు. దీంతో కౌన్సిల్ సభ్యులు కమిషనర్ ప్రసన్నవాణి, ఆర్‌ఓ రాఘవాచార్యులను షాపు అద్దె వ్యవహారంపై నిలదీశారు. షాపు ఖాళీగా ఉందో లేదో తెలియాలంటే దాన్ని తెరిచి చూడాలని పట్టుపట్టారు. తాళాలు ఆర్‌ఐ వద్ద ఉన్నాయని, ఆయన సెలవులో ఉన్నారని ఆర్‌ఓ చెప్పడంతో.. తాళాలు పగలగొట్టించి షాపు తెరవాలని డిమాండ్ చేశారు. దీంతో కమిషనర్ పోలీసులను పిలిపించి, మీడియా సమక్షంలో ఆ షాపు తాళాలను పగులకొట్టేందుకు అనుమతించారు. కాగా, ఆ షాపులో సుమారు రూ.50 వేల విలువ చేసే వస్తువులు కూడా లేవని పలువురు కౌన్సిలర్లు మాట్లాడుకున్నారు. ఈ అద్దె గోల్‌మాల్ అంశాన్ని అంత సులభంగా వదలమంటూ మరికొందరు కౌన్సిలర్లు చర్చించుకోవడం కనిపించింది. సమావేశంలో పలుశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలి



మాట్లాడుతున్న ఈఓపీఆర్‌ఆర్డీ కె.కుమారవర్మ

సీతానగరం: గ్రామాల్లో నిర్మించిన చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలు(ఎస్‌డబ్ల్యూపీసీ)ను వినియోగంలోకి తీసుకురావాలని ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. నిడగల్లు, జోగింపేట, పాపమ్మవలస చెత్తసంపద కేంద్రాలను బుధవారం పరిశీలించారు. నిడగల్లులో ఆయన మాట్లాడుతూ.. చెత్తనుంచి సంపద తయారు చేయడం వల్ల పంచాయతీకి అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను సేకరించి దాన్ని సంపద తయారీ కేంద్రాలకు చేర్చాలని, దాన్ని కంపోస్టుగా మార్చి రైతులకు అందించాలన్నారు. సర్పంచ్‌ల సహకారంతో పంచాయతీ అభివృద్ధికి కృషిచేయాలని కార్యదర్శులకు సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి పెంట తిరుపతిరావు, ఎస్‌డబ్ల్యూపీసీ సమన్వయకర్త ఎం.రమేష్, సచివాలయ ఉద్యోగులు, గ్రీన్ అంబాసిడర్లు ఉన్నారు.

మెరుగైన సేవలందించేందుకు కృషిచేస్తా..



తహసీల్దార్ అప్పలరాజు

సీతానగరం: అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తానని తహసీల్దార్ పి.అప్పలరాజు అన్నారు. మండల తహసీల్దార్‌గా బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న శాఖాపరమైన కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించేందుకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో డీటీ ఎ.ఉమామహేశ్వరరావు, ఆర్‌ఐ ఎన్.శ్రీనివాసరావు, సీనియర్ సహాయకుడు రామారావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



ప్రతిజ్ఞ చేస్తున్న మహిళా సంఘ సభ్యులు

గరుగుబిల్లి: పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగివుండాలని వెలుగు ఏపీఎం పి.అప్పలనాయుడు అన్నారు. పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా మండలంలోని మరుపెంట గ్రామంలో బుధవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. మహిళా సంఘాల సభ్యులు, గ్రామైఖ్య సంఘ సభ్యులతో పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

సెస్ బకాయిలు చెల్లించాలని వినతి

గరుగుబిల్లి: గ్రంథాలయ సంస్థ బకాయిలను చెల్లించాలని స్థానిక శాఖాగ్రంథాలయ నిర్వాహకులు ఎస్.మధుసూదనరావు కోరారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ విస్తరణాధికారి ఎల్.గోపాలరావుకు బుధవారం వినతిపత్రం అందించారు. విజయనగరం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదేశాల మేరకు మండలంలో వివిధ పంచాయతీల్లో పెండింగ్‌లో ఉన్న 8 శాతం బకాయిలు చెల్లించాలని కోరారు. గ్రంథాలయాల అభివృద్ధికి సెస్ నిధులు ఎంతో దోహదం చేస్తాయన్నారు. సెస్ చెల్లించేలా పంచాయితీ కార్యదర్శులను ఆదేశించనున్నట్లు పంచాయతీ విస్తరణాధికారి గోపాలరావు తెలిపారు.

8న పీఎంసీ ఎన్నిక

గరుగుబిల్లి: పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ(పీఎంసీ)ల ఎన్నిక షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేసిందని ఎంఈఓ ఎస్.నాగభూషణరావు బుధవారం తెలిపారు. తల్లిదండ్రుల కమిటీ పేరును మేనేజ్‌మెంట్ కమిటీగా మార్చుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకొందన్నారు. ప్రస్తుతం ఉన్న కమిటీల పదవీ కాలం జూలైతో ముగియనుండటంతో ఆగస్టులో ఎన్నికలు నిర్వహించేందుకు షెడ్యూల్ ప్రకటించిందన్నారు. గురువారం నోటిఫికేషన్ విడుదల చేయడం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ఆయా పాఠశాలలో ఓటరు జాబితాను నోటీసు బోర్డులో ఉంచడం జరుగుతుందన్నారు. 5న ఓటరు జాబితాలపై అభ్యంతరాలను స్వీకరించి, అదే రోజు ఓటరు తుది జాబితాను ప్రకటించడం జరుగుతుందన్నారు. ఆగస్టు 8న పీఎంసీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

మెనూ అమలులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



భోజనాలను రుచిచూస్తున్న ఏటీడబ్ల్యూఓ

కురుపాం: మెనూ అమలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఏటీడబ్ల్యూఓ చంద్రబాబు హెచ్చరించారు. బుధవారం సాక్షి దిన పత్రికలో 'మెనూ ప్రకారం భోజనం పెట్టరా..?' అనే శీర్షికతో వచ్చిన కథనంపై ఆయన స్పందించారు. వసతిగృహానికి వెళ్లి విద్యార్థులతో మాట్లాడి సమస్యపై ఆరాతీశారు. భోజనాలు ఎలా ఉంటున్నాయి, మెనూ ప్రకారం భోజనాలు పెడుతున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. చాలీచాలని భోజనం పెడుతున్నారని, మెనూ ప్రకారం పెట్టడం లేదని విద్యార్థులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఇకపై మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని కళాశాల ప్రిన్సిపాల్ సత్యవతిని ఏటీడబ్ల్యూఓ ఆదేశించారు. ఆయన వెంట సివిల్‌సప్లై అధికారులు, ఐటీడీఏ అధికారులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



మాట్లాడుతున్న అధికారులు

సాలూరు: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ నారాయణ అన్నారు. మండలంలోని తోణాం పీహెచ్‌సీని సర్వేలైన్స్ మెడికల్ ఆఫీసర్ డా.జాన్‌తో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. వివిధ విభాగాలకు చెందిన రికార్డులను తనిఖీ చేశారు. ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, వైద్య సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. విధుల నిర్వహణ పట్ల అలసత్వం వహించేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో పీహెచ్‌సీ వైద్యులు సుజాత, అజయ్, సూపర్‌వైజర్ జయ, తదితరులు పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

పార్వతీపురం: జిల్లాలో ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లను ఒకటో తేదీ ఉదయం 6 గంటల నుంచే సచివాలయ సిబ్బందితో ఇంటింటికీ పంపిణీ చేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. జిల్లాలో 1,43,398 మంది పింఛన్ లబ్ధిదారులకు గాను రూ.59.58 కోట్లు నిధులు విడుదలయ్యాయి. పింఛన్ల పంపిణీని పర్యవేక్షించేందుకు జిల్లా అధికారులను మండల ప్రత్యేకాధికారులుగా నియమించారు. ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశాలు జారీచేశారు. తొలిరోజే శతశాతం పింఛన్లు పంపిణీ చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. అనివార్య కారణాలతో ఎవరికైనా పింఛన్లు అందకపోతే మరుసటి రోజు అందించాలని సూచించారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు.

పార్వతీపురంటౌన్: పురపాలక సంఘ పరిధిలో అన్ని రకాల పింఛన్లు కలిపి 5,507 మంది లబ్ధిదారులు ఉన్నారని, వారందరికీ గురువారం ఉదయం నుంచి పింఛన్లు పంపిణీ చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టామని కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. పింఛన్ల పంపిణీ కోసం ప్రభుత్వం రూ.2,38,11,500లు విడుదల చేసిందన్నారు. ఉదయం 6 గంటల నుంచి సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి పింఛన్ డబ్బులు అందజేసేలా ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు.

కాలిబాటలతో అనేక ప్రయోజనాలు



తుమరాడలో వరి పొలంలో కాలిబాటలు తీయిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

బలిజిపేట: వరిపంటకు నాట్లు వేసిన తరువాత కాలిబాటలు తీయడం వలన పంట దిగుబడి పెరిగి రైతులకు మేలు జరుగుతుందని మండల వ్యవసాయశాఖ అధికారి శ్రావణ్‌కుమార్‌నాయుడు అన్నారు. తుమరాడ, మిర్తివలస, బర్లి, తదితర గ్రామాల్లో వరి పొలాలను బుధవారం పరిశీలించారు. రైతులతో పొలంలో కాలిబాటలు తీయించారు. వరినాట్లు వేసిన 10-15 రోజుల తరువాత కాలిబాటలు తీసుకోవాలని సూచించారు. ప్రతీ రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల మేర కాలిబాటలు తీసుకోవాలన్నారు. దీని వల్ల వరిపైరుకు తగినంత గాలి, వెలుతులు తగిలి దుబ్బుకడుతుందన్నారు. మొక్కలలో కిరణజన్య సంయోగక్రియ బాగా జరిగి అధిక దిగుబడులు వస్తాయన్నారు. సుడిదోమ, చీడపీడల ఉధృతి తగ్గుతుందన్నారు. ఎరువులు, పురుగుమందులు వేసుకునేందుకు కాలిబాటలు అనువుగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఏఈఓ చాందినీ, ఏపీసీఎన్‌ఎఫ్ సిబ్బంది లక్ష్మి, రైతులు ఉన్నారు.

చిగుళ్లు తుంచి నాట్లు వేసుకుంటే మేలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ అవినాష్

సీతానగరం: వరినాట్లు వేసేముందు చిగుళ్లను తుంచి నాటుకోవడం వల్ల చీడపీడల ఉధృతి తగ్గుతుందని ఏఓ అవినాష్ రైతులకు సూచించారు. మండలంలోని సూరంపేట గ్రామంలో వేస్తున్న వరినాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. తాడు సాయంతో వరుస క్రమంలో వరినాట్లు ఎలా వేసుకోవాలో రైతులకు అవగాహన కల్పించారు. వరుస పద్ధతిలో నాట్లు వేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వారికి వివరించారు. అనంతరం రైతులతో కలిసి నాట్లు వేశారు.

మలేరియా, డెంగీపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సబ్‌యూనిట్ ఆఫీసర్ మోహన్‌రావు

సీతంపేట: మండలంలోని పూతికవలస పంచాయతీ పరిధి చింతమానుకాలనీలో మలేరియా, డెంగీ వ్యాధుల నివారణపై మలేరియా నివారణా సబ్‌యూనిట్ ఆఫీసర్ జె.మోహన్‌రావు ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం దోమల నివారణకు ఏసీఎం 5 శాతం ద్రావణాన్ని పిచికారీ చేయించారు. కార్యక్రమంలో ఎంటీఎస్ ఝాన్సీరాణి పాల్గొన్నారు.

అమ్మపాలు..అమృతం

- ముర్రుపాలతో మృత్యువును జయించవచ్చు
- చిన్నారుల్లో రోగనిరోధక శక్తి మెరుగు
- నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు



తల్లిపాల వారోత్సవాలపై కార్యకర్తలకు సూచనలు చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు

పాలకొండ రూరల్: తల్లిని మించిన యోధులు ఈ సృష్టిలో లేరు. తల్లిపాల ద్వారా సమకూరే శక్తి ఎక్కడా లభించదు. అప్పుడే పుట్టిన బిడ్డకు తొలి ఆహారం, రోగ నిరోధక శక్తిని పెంచే తొలిటీకా తల్లిపాలే. అమ్మపాలే పిల్లలకు అమృతంతో సమానం. బిడ్డ శారీరక ఎదుగుదలకు ఎంతగానో దోహదపడతాయి. పుట్టిన శిశువుకు బలం చేకూర్చే ఆహారం తల్లిపాల ద్వారానే సమకూరుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. శతశాతం పోషక విలువలున్న తల్లిపాలు శిశువు ఆరోగ్యంగా ఎదగడంలో, ఆయుష్షు పెంచడంలో కీలకపాత్ర పోషిస్తాయి. అయితే ఈ విషయం తెలిసినా చాలా మంది తల్లులు పిల్లలకు ముర్రుపాలు ఇచ్చేందుకు ఇష్టపడడం లేదు. అప నమ్మకం, అభద్రతాభావం, తదితర కారణాలతో బిడ్డకు ముర్రుపాలు అందించేందుకు అయిష్టత చూపుతున్నారు. ఫలితంగా పిల్లల్లో రోగనిరోధక శక్తి తగ్గి భవిష్యత్‌లో వ్యాధుల బారిన పడే అవకాశం చేతులారా కల్పిస్తున్నారు. ఈక్రమంలో తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తూ ఐసీడీఎస్ నేతృత్వంలో వివిధ శాఖల అధికారులు సంయుక్తంగా ఏటా వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించేందుకు కసరత్తు చేపట్టారు.

ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో..

జిల్లాలోని 15 మండలాల్లో ప్రస్తుతం ఉన్న పది ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌ల పరిధిలో 2,064 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో ప్రధాన కేంద్రాలు 1,425 కాగా.. మినీ అంగన్‌వాడీ కేంద్రాలు 639. ఆయా కేంద్రాల ద్వారా చిన్నారులు 55,965 మంది, గర్భిణులు 5,835 మంది, బాలింతలు 5,565 మంది సేవలు పొందుతున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. కేంద్రాల్లో తల్లిపాల ఆవశ్యకతను అంగన్‌వాడీ వర్కర్లు వివరిస్తారు.

ఆరు నెలల వరకు..

బిడ్డ పుట్టిన వెంటనే తప్పనిసరిగా తల్లిపాలు పట్టించాలి. ఆరు నెలల పాటు తల్లిపాలను మాత్రమే ఆహారంగా ఇస్తే బిడ్డకు తేలికగా జీర్ణమవుతుంది.

బహుళ ప్రయోజనాలు..

- తల్లి పాలలో ప్రొటీన్లు లాక్టోఫెరిన్, కోలోస్ట్రమ్, కొన్ని కీలకమైన హార్మోన్లు, రోగ నిరోధక బ్యాక్టీరియా ఉంటాయి.
- తల్లిపాలు తాగే పిల్లలు ఎక్కువగా బలంగా ఉంటారు. వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుంది. తెలివి తేటలు ఎక్కువగా ఉంటాయి.
- బిడ్డకు పాలు ఇవ్వడం ద్వారా తల్లీబిడ్డల మధ్య అనుబంధం పెనవేసుకుంటుంది.
- పాలిచ్చే తల్లులకు నెలసరిలో రక్తస్రావం కూడా తక్కువగా ఉంటుంది. పాలిచ్చినంత కాలం మళ్లీ గర్భం రాకుండా గర్భ నిరోధకంగా కూడా పనిచేస్తుంది.
- పాలిచ్చే తల్లులకు రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లు రావు.

తల్లిపాలు శుభ్రంగా ఎలాంటి క్రిములు లేకుండా ఉంటాయి. శ్వాసకోశ, అలర్జీ, ఆస్తమా, చర్మ వ్యాధుల నుంచి పిల్లలను రక్షిస్తాయి. బిడ్డ మానసిక, శారీరక వికాసానికి అవసరమైన పోషకాలు తల్లి పాలలో ఉంటాయి. రోజులో బిడ్డకు 8 నుంచి పది సార్లు పాలు ఇవ్వాలి. ఆరు మాసాల తర్వాత నుంచి బిడ్డకు తల్లి పాలతో పాటు అనుబంధ ఆహారం ఇవ్వాలి. రెండేళ్ల వరకు క్రమం తప్పకుండా పాలు పట్టాలి.

వ్యాధి నిరోధక శక్తి..

కాన్పు అయిన మొదటి కొద్ది రోజులు తల్లిపాలు చిక్కగా, పసుపు రంగులో ఉంటాయి. వీటినే ము ర్రు పాలు అంటారు. ఇందులో ప్రొటీన్లు అధికంగా ఉంటాయి. వీటిలో విటమిన్ ఎ,బీలతో పాటు తగినంత ఐరన్ కూడా ఉంటుంది. ముర్రుపాలతో శిశువులు చక్కగా పెరుగుతారు.

తల్లి చేయకూడనివి..

- పంచదార నీళ్లు, తేనె, ఆవు పాలు, మేక పాలు, వస, గోమూత్రం బిడ్డకు పట్టకూడదు.
- ఆరు నెలలు పూర్తయ్యే వరకు బిడ్డకు తినడానికి, తాగడానికి ఏమీ ఇవ్వకూడదు.
- సీసాలతో పాలు కూడా పట్టకూడదు.

భారం అనుకోవద్దు..



తల్లులు తమ బిడ్డలకు ముర్రుపాలు పట్టించడం భారం అనుకోవద్దు. పుట్టిన బిడ్డకు వెంటనే తల్లి పాలు పట్టించాలి.తల్లి అన్ని రకాల ఆహారం తీసుకోవాలి. ఆరు నెలల తర్వాత తల్లిపాలతో పాటు బిడ్డకు తేలికపాటి ఆహారం అందించాలి. అమ్మ పాలలో ఉండే పోషక విలువలు చిన్నారుల ఆరోగ్య రక్షణకు ఎంతో మేలు చేస్తాయి.

– ఆర్.భారతి, స్త్రీ, ప్రసూతి విభాగం వైద్యనిపుణులు, పాలకొండ

అమృతంతో సమానం..



ముర్రుపాలు బిడ్డకు అమృతం లాంటివి. తల్లిపాల అవ శ్యకతను తెలియజేసేందుకు ఏటా తల్లిపాల వారోత్సవాలను ఆగస్టు మొదటి వారంలో నిర్వహిస్తాం. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు స్థానిక వైద్య సిబ్బందితో కలసి తల్లిపాల విశిష్టతను తెలియజేస్తూ ర్యాలీ, అవగాహన సదస్సులు నిర్వహిస్తాం.

– ఎంఎన్ రాణి, ఐసీడీఎస్ పీడీ, పార్వతీపురం మన్యం